క్లుప్తంగా

ప్రమాద బాధితుడిని పరామర్శించిన చైర్‌పర్సన్



దొరబాబును యోగ క్షేమాలు అడిగి తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: ప్రమాదానికి గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బత్తిన దొరబాబును మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి ఆదివారం పరామర్శించారు. 20వ వార్డు గొల్లపుంత కాలనీలో నివాస ముండే దొరబాబు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వీరి కిరణ్‌గౌడ్, కంఠంశెట్టి గణేష్, పేరూరి మాధవి, గనిపే నాగభూషణం, కాకాడ నూకరాజు, పెందుర్తి జాన్, పాడగట్లపల్లి పద్మ, సేనాపతి దొరబాబు, గనిపే ఆనంద్ ఉన్నారు.

బీబీ ఫాతిమా గంధోత్సవం



ద్రాక్షారామలో గంధోత్సవ ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో వేంచేసిన బీబీ ఫాతిమా గంధోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుర్రంపై గంధం, జెండాలను ద్రాక్షారామ ఆగా వారి వీధి, వెలంపాలెం వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. వెలంపాలెం షాబాజియా మసీదు కమిటీ ప్రెసిడెంట్ సయ్యద్ ఫాజిల్, జెండా కమిటీ సభ్యులు షేక్ బషీర్, నౌషాద్‌బాబు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కాజులూరు ఎంపీడీఓగా నాగేశ్వర శర్మ



బాధ్యతలు చేపట్టిన చీమలపాటి నాగేశ్వరశర్మ

కాజులూరు: మండల ఎంపీడీఓగా కాజులూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఏఓ చీమలపాటి నాగేశ్వరశర్మ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఎంపీడీఓగా ఉన్న ఐ.రత్నరాజు ఆదివారం ఉద్యోగ విరమణ చేసిన కారణంగా నాగేశ్వర శర్మకు పూర్తి అదనపు బాధ్యతలతో ఎంపీడీఓగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనితో ఆయన ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

వరి సాగులో నారుమడి దశే కీలకం



నూటికి 90 శాతం పైబడి మొలకెత్తిన నాణ్యమైన వరి విత్తనాలు

కాజులూరు: ఏ రకం పంటల సాగులోనైనా విత్తనం బలంగా ఉంటేనే పైరు ఆరోగ్యం పెరుగుతుందనేది జగమెరిగిన సత్యం. ప్రస్తుతం తూర్పు డెల్టాలోని వరి సాగు భూముల్లో పంట దమ్ములు నిర్వహిస్తూ నారుమడులు చల్లుకునేందుకు సిద్ధమౌతున్నారు. డివిజన్‌లో కొందరు రైతులు నారుపోసి నాట్లు వేసే విధానాన్ని అవలంబిస్తుండగా, కొందరు రైతులు వెదచల్లిక (నేరుగా వరి విత్తనాలను దదును చేసిన పొలంలో చల్లడం) విధానాలను అవలంబిస్తున్నారన్నారు. వెదచల్లిక విధానంలో మొలక శాతం తక్కువగా ఉన్నట్లయితే వరి మొక్కల మధ్య దూరం పెరుగుతుంది. నారుమడుల విధానంలోనూ మొలక శాతం తకువగా ఉన్నట్లయితే నారు కొరత ఏర్పడుతుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు రైతులు ముందుగానే వరి విత్తనాల్లో మొలక శాతాన్ని పరిశీలించి విత్తనాలు చల్లుకోవాలని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ చెబుతున్నారు.

విత్తనాల మొలక శాతాన్ని పరిశీలించే విధానం

విత్తనాల మొలక శాతాన్ని పరిశీలించేందుకు ముందుగా పలుచని గుడ్డ, లేదా సరైన కాగితాన్ని తీసుకుని మడతలు, మడతలుగా చేయాలి. 100 వరి విత్తన గింజలను తీసుకుని మడతల మధ్య ఉంచి దానిని 24 గంటలు పూర్తిగా నీటిలో నానబెట్టాలి. తర్వాత పైకి తీసి 24 గంటలు పొడిగుడ్డ లేదా గడ్డితో కప్పి మండీ కట్టాలి. ఐదు రోజుల తర్వత మొలక శాతాన్ని లెక్క కట్టాలి. 80 గింజలు తక్కువ కాకుండా మొలకెత్తినట్లయితే అవి నాణ్యమైనట్టుగా గుర్తించి మొత్తం విత్తనాలను నానబెట్టుకోవచ్చని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. వ్యవసాయ సేద్యంలో విత్తన దశ ఎంతో కీలకమైందని రైతులు మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారానే పైరు ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడులు సాధించవచ్చన్నారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

- ప్రతి శని, బుధవారాల్లో ఉచితంగా టీకాలు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరిపడా నిల్వలు

కె.గంగవరం: వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గర్భిణులు నుంచి అప్పుడే పుట్టిన చిన్నారుల వరకు ప్రభుత్వం సూచించిన సమయాల్లో ఆయా టీకాలు, వ్యాక్సిన్లు వేయిస్తే వ్యాధులు దరిచేరకుండా జీవితాంతం ఆరోగ్యకమైన జీవితం గడపవచ్చు. అయితే చాలా మంది ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు టీకాలపై సరైన అవగాహన లేక వివిధ రకాల వ్యాధులకు గురవుతూ ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలకు సరైన అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వసుపత్రుల్లోనూ ప్రతి శని, బుధవారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధినిరోధక టీకాలు వేస్తున్నారు.

వ్యాక్సిన్లు ఇలా..

- గర్భిణిగా నిర్ధారణ అయిన 3 నెలలు నిండిన తరువాత టీటీ ఇంజక్షన్ వేయాలి. నెల రోజుల వ్యవధిలో మరో టీటీ ఇంజక్షన్ వేయాలి. వీటితో పాటు ఐరన్, పోలిక్, కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ టాబ్లెట్లు ఇస్తారు.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హైపటైటిస్–బి డోస్ వేయాలి. వీటి వల్ల పోలియో, పచ్చకామెర్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.
- 4 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి.
- 6, 14 వారాలో ఐపీవీ చుక్కలు వేయించాలి. వీటితో పాటు 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటావాలెంట్ వేయించాలి. వీటి వల్ల కోరింత దగ్గు, కంఠ సర్పి, ధనుర్వాతం, మొదడు వాపు, పచ్చకామెర్లు వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడుకోవచ్చు.
- 9 నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్–ఏ చుక్కలు వేయించాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోస్ టీపీటీ, మీజిల్స్, విటమిన్–ఏ ఓపీని వేయించాలి.
- 5 ఏళ్లు పూర్తయిన తరువాత టీపీటీ డోస్ వేయించాలి.
- 10,16 సంవత్సరాలు పూర్తయితే టెట్నాస్(టీటీ) వేయించాలి
- 9 నెలల నుంచి 5 ఏళ్ల వయస్సు వరకు ప్రతి ఆరు నెలలకోకసారి విటమిన్–ఏ చుక్కలు మొత్తం 9 డోసులు వేయించాలి..



పామర్రు సబ్‌సెంటర్ వద్ద టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

టీకాలు తప్పనిసరిగా వేయించాలి

గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వీటి వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో టీకాలపై తమ సిబ్బంది ద్వారా నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాలు సద్వినియోగం చేసుకోవాలి.

– పి.హర్షిత, వైద్యాధికారి, పామర్రు పీహెచ్‌సీ

వంతెన వద్ద తుప్పలు తొలగించాలి



ఉండూరు వంతెన దిగువలో రోడ్డుకి ఇరువైపులా పెరిగిన తుప్పలు

కాజులూరు: కాకినాడ, కోటిపల్లి రహదారిలో ఉండూరు వంతెన వద్ద రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగి ఉన్న తుప్పలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారి పొడవునా ఇరువైపులా ముళ్లపొదలు, గడ్డి మొక్కలు పెరిగి ఉన్నాయి. వంతెన దిగువలో మలుపు ఉండటానికి తోడు దట్టంగా పెరిగిన ముళ్ల పొదల కారణంగా దగ్గరకు వచ్చే వరకు ఎదురెదురుగా వచ్చు వాహనాలు ఒకదానికి ఒకటి కనిపించడం లేదు. దీంతో ఇక్కడ ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. మండల గ్రామాలకు చెందిన ప్రజలు నియోజకవర్గ కేంద్రమైన రామచంద్రపురానికి నియోజకవర్గంలోని ఇతర మండల గ్రామాల ప్రజలు కాకినాడ జిల్లా కేంద్రమైన కాకినాడకు వెళ్లాలంటే ఈ వంతెనపై నుంచి ప్రయాణం సాగించాల్సిందే. అధికారులు స్పందించి రోడ్డు పక్కల ఉన్న పొదలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం



ఉద్యోగ విరమణ చేసిన కార్మికులను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: మండపేట మున్సిపాలిటీలో దాదాపు మూడున్నర దశాబ్దాల పాటు ఎనలేని సేవలందించి పట్టణ పరిశుభ్రతకు కృషి చేసిన కణితి సింహాచలం, ముత్యాల సింహాచలం ఉద్యోగ విరమణ పొందారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి వారి సేవలకు గుర్తింపుగా ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఆదివారం టౌన్‌హాలులో ఏర్పాటు చేసిన పారిశుధ్య కార్మికుల ఉద్యోగ విరమణ మహోత్సవంలో చైర్‌పర్సన్ దుర్గారాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిద్దరినీ దుశ్శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల ఇరువురి సేవలను కొనియాడారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో విలువైనదని అన్నారు. అత్యుత్తమ సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన ఇరువురికి అభినందనలు తెలియజేశారు. అనంతరం నూతన వస్త్రాలు, స్వీట్లు బహూకరించి, ప్రావిడెంట్ ఫండ్ చెక్‌ను అందించారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మిక సంఘాలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆదుకోవడంలో ఎల్లప్పుడూ ముందంజ



జర్నలిస్ట్ సుదర్శనరావు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న అలయన్స్ క్లబ్, జనసేన నాయకులు

కాజులూరు: సమాజంలో ఆపదలో ఉన్న వారికి తమ వంతు సహకారమందించి ఆదుకోవటంలో అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని క్లబ్స్ ఇంటర్‌నేషనల్ ఎక్స్‌టెన్షల్ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని చేదువాడలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ గెద్దాడ సుదర్శనరావు కుటుంబీకులను ఆదివారం గొల్లపాలెం లీలాకళ్యాణిసాధన క్లబ్ అధ్యక్షురాలు సలాది పుష్పవతి ఆధ్వర్యంలో అలయన్స్‌క్లబ్ సభ్యులు, పలువురు స్థానిక నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా అలయన్స్‌క్లబ్ సభ్యులు రూ.10 వేలు, రామచంద్రాపురం జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ రూ.ఐదువేలు, మండల జనసేన అధ్యక్షులు బొండా వెంకన్న రూ.ఐదువేలు సుదర్శనరావు కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్స్ జిల్లా గవర్నర్ వనుం శ్రీనివాస్, క్లబ్స్ జిల్లా సెక్రటరీ కిరణ్‌కుమార్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సర్వ సన్నద్ధం

- మండపేట నియోజకవర్గంలో 39,483 మందికి లబ్ధి
- వివిధ సామాజిక పింఛన్ల ద్వారా రూ. 26,35,44,000 పంపిణీ



కపిలేశ్వరపురంలో పింఛన్ల పంపిణీపై ఆదేశాలిస్తున్న ఎంపీడీఓ కొండలరావు

కపిలేశ్వరపురం: దేశంలో మరెక్కడా లేని విధంగా పేదల ఇళ్లకు వెళ్లి పింఛను డబ్బులు చేతికందించే విధానాన్ని గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూపొందించి విజయవంతంగా అమలు చేశారు. అందుకోసం ఏర్పాటు చేసుకున్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఐదేళ్ల పాటు ఫలప్రదంగా నడిచాయి. నూతనంగా అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం అమలు చేసిన పద్ధతిలోనే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను సొమ్ము ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో 50 ఇళ్లకు ఒక సచివాలయ ఉద్యోగికి పంపిణీ బాధ్యతలను అప్పగించారు. మండపేట నియోజకవర్గంలోని మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల ఎంపీడీఓలు, మండపేట మున్సిపల్ కమిషనర్ రాములు సచివాలయ ఉద్యోగులకు తగిన ఆదేశాలను ఇచ్చారు. ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. పట్టణం, మూడు మండలాల పరిధిలో 39,483 మందికి రూ.26,35,44,000 విలువైన వివిధ రకాల సామాజిక పింఛన్లను పంపిణీ చేయన్నునారు.

పింఛను రకం	లబ్ధిదారులు	పంపిణీ చేస్తున్న నగదు
వృద్ధులు	19,539	13,67,73,000
వితంతు	9,437	6,60,59,000
చేనేత	1,128	78,96,000
కల్లుగీత	442	30,94,000
మత్స్యకార	214	14,98,000
ఒంటరి మహిళ	1,280	89,60,000
చెప్పులు కుట్టువారు	203	14,21,000
ట్రాన్స్ జెండర్	02	14,000
డప్పు కళాకారులు	232	16,24,000
కళాకారులు	13	91,000
వికలాంగ	5,562	3,33,72,000
లెప్రసీ	09	54,000
పక్షవాతం	66	9,90,000
కండరాల సమస్య/ ప్రమాద బాధితులు	17	2,55,000
బోధ వ్యాధి గ్రేడ్ 4	10	1,00,000
కిడ్నీ, లివర్, గుండె మార్పిడి	05	50,000
సీకేడీయూ ఆన్ డయాలసిస్ ప్రైవేట్	34	34,0000
సీకేడీయూ ఆన్ డయాలసిస్ గవర్నమెంట్	14	1,40,000
సికిల్ సెల్ రోగులు	06	60,000
తలసేమియా రోగులు	05	50,000
సివియర్ హీమోఫీలియా	06	60,000
సైనిక సంక్షేమ పింఛన్లు	03	15,000
అభయహస్తం	1,256	6,28,000
మొత్తం	39,483	26,35,44,000

ఉపాధ్యాయులే దేశ ఉన్నత భవితకు మార్గదర్శకులు

కొత్తపేట: విద్యాలయాల్లో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడం ద్వారా దేశ ఉన్నత భవిష్యత్‌కు మార్గదర్శకులుగా నిలిచేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని మోడేకుర్రు ఎంపీపీ స్కూలు హెచ్‌ఎంగా పనిచేసిన మర్రి వీవీ సత్యనారాయణ, వానపల్లి శివారు సంఘంపాలెం ఎంపీపీ యూపీ స్కూలు హెచ్‌ఎంగా పనిచేసిన వాసంశెట్టి వెంకటరమణ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం మండల విద్యాశాఖ, యూటీఎఫ్, ఎస్‌టీయూ సంయుక్త ఆధ్వర్యంలో పై ఇద్దరు ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వీడ్కోలును ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో నిర్వహించిన సభకు ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే సత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సత్యనారాయణ, వెంకటరమణ దంపతులను ఎమ్మెల్యే బండారు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, సర్పంచ్ బూసి జయలక్ష్మి, యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

వైద్యం సామాజిక బాధ్యత

- విశేష సేవలందిస్తున్న వైద్యులు
- క్షేత్రస్థాయిలో ప్రజారోగ్యాన్ని కాపాడుతున్న పీఎంపీలు
- పేదలకు ప్రభుత్వ వైద్యుల సేవలు చేరువ చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవం



అంగరలో ఇంటికెళ్లి రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి పి.రత్నకుమారి (ఫైల్)

కపిలేశ్వరపురం: ఏజీవికైనా ప్రాణంపోసేది అమ్మ. అదే జీవి అనారోగ్యం పాలైతే ఔషధాన్నిచ్చి కాపాడి పునర్జన్మనిచ్చేది వైద్యుడు. తెల్లటి కోటు ధరించి, చేతిలో స్టెతస్కోప్ మెడలో వేసుకున్న వైద్యుడుని ప్రతి ఒక్కరూ ఆరాధనా భావంతో గౌరవిస్తారు. వైద్యో నారాయణో హరి అన్నట్టుగానే ప్రాణాలను కాపాడినందుకు జీవితాంతం ప్రతి శ్వాసలోనూ వైద్యుడిని ప్రజలు గుర్తు పెట్టుకుని కొలుస్తారు. సమాజంలో వైద్యుడికి ప్రత్యేక స్థానం ఉంది. విలవిల్లాడుతున్న రోగి బాధకు చలించి వైద్య సేవలందించడంలో సామాజిక బాధ్యత ఇమిడి ఉంటుందని వైద్యులు అంటున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య పథకాలను అమలు చేస్తూ ఐదేళ్ల జగన్ మోహన్‌రెడ్డి పాలన చరిత్ర సృష్టించింది. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఆసుపత్రికీ ఇద్దరు వైద్యులను నియమించడమే కాకుండా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలోనూ ఒక్కో ప్రభుత్వ వైద్య కళాశాలలను నెలకొల్పారు. మనసున్న వైద్యుడు రోగి శారీరక సమస్యలకే కాకుండా మానసిక రుగ్మతలను సైతం దూరం చేస్తారని నానుడి. జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఈ కథనం...

డాక్టర్స్ డే నేపథ్యం

ప్రజలకు విశేష సేవలందించిన ప్రముఖ వైద్యుడు, బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బీసీ రాయ్ గౌరవార్థం ఆయన పుట్టిన రోజైన జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. 1882 జూలై 1న జన్మించిన బీసీ రాయ్ 1962లో అదే రోజున తుది శ్వాస విడిచారు. ఆయన సేవలకు గుర్తుగా 1991 జూలై 1 నుంచి జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

రెండు నియోజకవర్గాల్లో వైద్యులిలా...

రామచంద్రపురం నియోజకవర్గంలో తొమ్మిది పీహెచ్‌సీలుండగా 15 మంది వైద్యులున్నారు. మండపేట నియోజకవర్గంలో ఏడు పీహెచ్‌సీలుండగా 15 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. వారంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ తదితర పథకాలు ద్వారా పేదలకు విశేష సేవలందించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆసుపత్రికి రాలేని వృద్ధులు, వికలాంగులు, బాలింతలు, గర్భిణుల ఇళ్లకు వెళ్లి వైద్యులు సేవలందించారు. విలేజి క్లినిక్‌లు ఏర్పాటు చేయడమే కాకుండా వాటికి సొంత భవనాలను నిర్మించారు. కంటి వెలుగు పథకం పేరుతో వైద్యులు, చిన్నారులకు కంటి పరీక్షలను చేసి ఉచితంగా కళ్లజోళ్లను అందించింది. రామచంద్రపురం, ద్రాక్షారామ, మండపేట, రాయవరంలో ప్రైవేటు రంగంలో వైద్యులు విశేష సేవలందిస్తున్నారు. 120 గ్రామాల్లో అనేక మంది పీఎంపీలు క్షేత్ర స్థాయిలో వారి పరిమితిల్లో వైద్య సేవలందిస్తున్నారు.

నాన్న ప్రేరణతో వైద్య వృత్తి



ప్రభుత్వ రంగంలో వైద్యురాలిగా కొనసాగుతుండటం గర్వంగా ఉంది. నాన్న సూర్య నారాయణమూర్తి ప్రేరణతో నేను డాక్టర్ అయ్యాను. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్య తరగతి ప్రజలకు సేవలందించడాన్ని సామాజిక బాధ్యతగా స్వీకరిస్తున్నాను. సబ్ డివిజనల్ అధికారిగా సహ వైద్యులకు సైతం అదే చెబుతుంటాను.

– డాక్టర్ ఎస్.ప్రశాంతి, సబ్ డివిజనల్ ఆఫీసర్, వైద్యఆరోగ్య శాఖ, రామచంద్రపురం డివిజన్

సేవే లక్ష్యంగా పని చేయాలి



వైద్య వృత్తి సామాజికమైనది. ప్రకృతి శక్తులపైనా, సామాజిక స్థితిగతులపైనా అవగాహన పెంచుకోవడం ద్వారా వైద్యునిగా ఫలప్రదం కాగలరు. వైద్యం వ్యాపారమయమైన నేటి సమాజంలో వైద్యుడు ప్రజల పక్షాన నిలవడం కత్తిమీద సాములా మారింది. అయినప్పటికీ పేద, మధ్య తరగతి ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేయాలి.

– డాక్టర్ చల్లా రవికుమార్, హోమియో వైద్యుడు, మండపేట

పేదలకు వైద్య సేవలే లక్ష్యం



రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో వైద్య విద్యను పూర్తి చేశాను. పాఠశాల విద్యనభ్యసిస్తున్నప్పుడే డాక్టరు కోర్సు చదవాలనుకున్నాను. అమ్మానాన్నా ప్రోత్సాహం నన్ను ముందుకు నడిపించింది. సీనియర్ వైద్యుల పర్యవేణలో పనిచేయడంతో నాలో అవగాహన స్థాయిని పెంచింది. పేదలకు వైద్య సేవలందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతాను.

– ముక్కపాటి రమ్య, వెలగతోడు, మండపేట మండలం

క్షేత్రస్థాయిలో సేవలతో సంతప్తి



పీఎంపీగా క్షేత్ర స్థాయిలో ప్రాథమిక వైద్య సేవలందించడం సంతృప్తినిస్తుంది. సీనియర్ వైద్యులు తరచూ నిర్వహించే ఆరోగ్య సదస్సులకు హాజరవుతూ చికిత్స పద్ధతులను తెలుసుకుంటాను. చికిత్సను అందించడంతోపాటు వ్యాధిపై అవగాహన కల్పించడం ప్రాథమికమైనదని నమ్ముతాను.

– సూరంపూడి భద్రరావు, పీఎంపీ వైద్యులు, టేకి

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో ప్రభుత్వం పెంచిన పింఛన్ల సొమ్మును సోమవారం పంపిణీ చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని 18 గ్రామాల పరిధిలోని 24 గ్రామ సచివాలయాలు ఉండగా 11172 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి జూన్ నెలకు సంబంధించి రూ.3.36 కోట్లు పంపిణీ చేశారు. జూలై నెలకు సంబంధించి 184 మంది గ్రామ సచివాలయ సిబ్బందితో రూ.7,44,74,500 పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా గ్రామ సచివాలయాలకు పింఛన్ల సొమ్ము అప్పగించినట్లు ఎంపీడీఓ ఎ.మేరీరోజ్ ఆదివారం తెలిపారు.

నేడు పాణింగపల్లిలో పింఛన్ల పంపిణీ

కె.గంగవరం: మండలంలోని పాణింగపల్లిలో నేడు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పెంచిన పింఛన్లు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పంచాయతీ పరిధిలో డోర్ టు డోర్ పింఛన్లు అందిస్తారని ఆయన పేర్కొన్నారు. మిగిలిన గ్రామాల్లో ఉదయం 5 గంటల నుంచి రోడ్ టు డోర్ పింఛను పంపిణీ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. పింఛను దారులు ఆయా గ్రామాల్లో ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

రాయవరం: లబ్ధిదారులకు నేటి నుంచి పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్‌టీఆర్ భరోసా పేరుతో సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నారు. మండలంలో 10,242 మంది లబ్ధిదారులకు రూ.6,72,88,500 పంపిణీ చేయనున్నారు. మండలంలోని చెల్లూరులో 1,627, కురకాళ్లపల్లిలో 257, కూర్మాపురం 361, లొల్ల 207, మాచవరం 1,466, నదురుబాద 160, పసలపూడి 1,400, రాయవరం 1,223, సోమేశ్వరం 1,259, వి.సావరం 481, వెదురుపాక 886, వెంటూరు 915 మందికి పింఛన్లు అందజేయనున్నారు. ఉదయం ఐదు గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ల పంపిణీని చేపట్టనున్నామని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి ఆదివారం తెలిపారు.